# పోలీసులకు ప్రజలు సహకరించాలి

- ప్రశాంత వాతావరణంలో ఓటు హక్కును వినియోగించుకోండి
- సైబరాబాద్ పోలీసు కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర



సిక్ చావనీలో సిక్కు కమ్యూనిటీ పెద్దలతో మాట్లాడుతున్న సీపీ స్టీఫెన్ రవీంద్ర

సిటీబ్యూరో, అక్టోబర్ 29 (నమస్తే తెలంగాణ): అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలోని రాజేంద్రనగర్, మాదాపూర్, బాలానగర్, మూసాపేట, శేరిలింగంపల్లి, నానక్‌రామ్‌గూడ, ఖానామెట్, మాదాపూర్, అత్తాపూర్, సిక్ చావనీ.. తదితర ప్రాంతాల్లోని సమస్యాత్మక ప్రాంతాలలో సైబరాబాద్ పోలీసు కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర సుడిగాలి పర్యటన చేశారు. ఆయా ప్రాంతాల స్థితిగతులను స్థానికులతో మాట్లాడి తెలుసుకున్నారు. సమస్యాత్మక ప్రాంతాల్లో ఏర్పాటు చేయనున్న బందోబస్తు వివరాలపై ఆరా తీశారు. తొలుత రాజేంద్రనగర్ నియోజకవర్గంలోని అత్తాపూర్, సిక్ చావనీలో పర్యటించారు. అనంతరం సిక్ చావనీలో సిక్కు కమ్యూనిటీ పెద్దలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగే విధంగా పోలీసు శాఖ అన్ని రకాల చర్యలు చేపడుతున్నదని, పోలీసులకు ప్రజలు సహకరిస్తూ, శాంతియుత వాతావరణంలో తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. ఎన్నికల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా తగిన చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఇందుకు ప్రజలు కూడా తమ వంతుగా సహకరించాలన్నారు. పోలీసు సిబ్బంది కూడా పారదర్శకంగా వ్యవహరించాలని సూచించారు. సీపీ పర్యటనలో బాలానగర్ డీసీపీ ఎ.శ్రీనివాసరావు, మాదాపూర్ డీసీపీ సందీప్, రాజేంద్రనగర్ డీసీపీ జగదీశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

## తనిఖీలు నిష్పక్షపాతంగా చేపట్టాలి

*జిల్లా కలెక్టర్ గౌతమ్*



మేడ్చల్, అక్టోబర్ 29 (నమస్తే తెలంగాణ): జిల్లాలోని ఐదు నియోజకవర్గాల్లో ఏర్పాటు చేసిన చెక్ పోస్టుల్లో వాహనాల తనిఖీలు నిష్పక్షపాతంగా, పకడ్బందీగా చేపట్టేలా చూడాలని మేడ్చల్- మల్కాజిగిరి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ గౌతమ్ అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డితో కలిసి ఫ్లయింగ్ స్క్వాడ్, స్టాటిక్ సర్వేయలెన్స్ టీం, పోలీసులు, ఐటీ, జీఎస్టీ నోడల్ అధికారులతో కలిసి ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. తనిఖీలలో పట్టుబడ్డ నగదును ఎన్నికల నియమావళి మేరకు సీజ్ చేయాలన్నారు. నగదు, బంగారం, ఇతర వస్తువులు స్వాధీనం చేసుకునే సమయంలో సరైన పత్రాలతో రికార్డు చేసుకోవాలని సూచించారు. మద్యం, నగదుపై నిఘాను పెంచి.. తనిఖీల్లో దొరికిన నగదు, నగలను గ్రీవెన్స్ కమిటీకి అన్ని ఆధారాలతో సహా సమర్పించాలన్నారు. సరైన అధారాలు ఇచ్చిన వారికి నిబంధనల మేరకు నగదును విడుదల చేయాలన్నారు.

**ఎన్నికల నిర్వహణపై నిరంతర పర్యవేక్షణ..**

ఎన్నికల నిర్వహణపై నిరంతర ఉన్నత స్థాయి అధికారుల పర్యవేక్షణ కొనసాగుతున్నదని, అధికారులు ఎన్నికల విధులలో ఏ మాత్రం నిర్లక్ష్యం చేయరాదని జిల్లా కలెక్టర్ గౌతమ్ హెచ్చరించారు. ఫిర్యాదులపై నోడల్ అధికారులు ఎప్పటికప్పుడు స్పందించాలన్నారు. ఎన్నికల కమిషన్ నిబంధనలను ఉల్లంఘించిన అధికారులపై చర్యలు తప్పవన్నారు. ఎన్నికల విధులలో నోడల్ అధికారులు సమన్వయంతో పనిచేయాలని కోరారు. ఈ సమావేశంలో నోడల్ అధికారులు రమణ మూర్తి, శ్రీనివాసమూర్తి, దేవసహాయం, కృష్ణారెడ్డి, రవీందర్ తదితర అధికారులు పాల్గొన్నారు.

## ఓటింగ్ శాతం పెంచేందుకు.. నగరంలో వినూత్న కార్యక్రమం

సిటీబ్యూరో, అక్టోబర్ 29 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్ జిల్లాలో ఓటింగ్ శాతం పెంచేందుకు జిల్లా ఎన్నికల అధికారి, జీహెచ్ఎంసీ కమిషనర్ రొనాల్డ్ రాస్ వినూత్న చర్యలు తీసుకుంటున్నారు. నామినేషన్ ముగిసిన తర్వాత ఓటింగ్‌కు తక్కువ సమయం ఉంది. ఈ నేపథ్యంలో ఓటర్లకు తప్పనిసరిగా ఓటింగ్‌లో పాల్గొనేలా చర్యలు తీసుకుంటున్నారు. నగరంలో ఓటరుగా నమోదైన ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ఓటు వేసేందుకు బూత్ స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ అవగాహన కార్యక్రమంలో బూత్ స్థాయి అధికారి ఇంటింటికీ వెళ్లి స్టిక్కర్ అంటించడంతో పాటు కరపత్రాన్ని అందించాలని సూచించారు. అంటించే స్టిక్కర్‌లో ఒక ఓటరుగా గర్వ పడుతున్నాను.. అనే అంశంతో ఓటింగ్ రోజుతో పాటు పోలింగ్ స్టేషన్‌ను తెలిపేలా సమాచారం ఉండాలని సూచించారు. ఓటింగ్ శాతం పెంచేందుకు బీఎల్ఓ పాత్ర కీలకంగా భావించిన ఎన్నికల కమిషన్.. ఇంటింటికీ వెళ్లే కార్యక్రమాన్ని చేపట్టింది. నవంబర్ 30న పోలింగ్ ఉన్న నేపథ్యంలో ఓటరు సమాచారం స్లిప్‌లను నామినేషన్ ముగిసిన వెంటనే పంపిణీ చేసేందుకు అన్ని సిద్ధం చేసుకోవాలని సూచించారు. ఓటర్ల కోసం మరిన్ని సేవలందించేందుకు ఓటరు హెల్ప్‌లైన్ యాప్‌ను కూడా అందుబాటులోకి తీసుకువస్తున్నట్టు ఎన్నికల అధికారి రొనాల్డ్ రాస్ తెలిపారు.

## రిటర్నింగ్ ఆఫీసర్ కార్యాలయాల వద్ద 144 సెక్షన్
# 3 నుంచి 15 వరకు ఆంక్షలు

**నగర పోలీస్ కమిషనర్ సందీప్ శాండిల్య**

సిటీబ్యూరో, అక్టోబర్ 29 (నమస్తే తెలంగాణ): అసెంబ్లీ ఎన్నికల నామినేషన్లు వచ్చే నెల 3వ తేదీ నుంచి మొదలు కావడంతో.. రిటర్నింగ్ ఆఫీసర్స్ కార్యాలయాలకు 100 మీటర్ల పరిధిలో 144 సెక్షన్ విధిస్తూ నగర పోలీస్ కమిషనర్ సందీప్ శాండిల్య ఉత్తర్వులు జారీ చేశారు. నవంబర్ 30వ తేదీన తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు జరుగనున్నాయి. ఈ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ 3వ తేదీన ప్రారంభమై.. 10వ తేదీ వరకు కొనసాగనుంది. 15వ తేదీ వరకు విత్‌డ్రాల్ ప్రక్రియ కొనసాగనున్నది. హైదరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఉన్న 15 అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించిన ఎన్నికల రిటర్నింగ్ కార్యాలయాల వద్ద ఈ ఆంక్షలు 3వ తేదీ నుంచి 15వ తేదీ వరకు అమలులో ఉంటాయన్నారు. నియోజకవర్గాలు, వాటి రిటర్నింగ్ అధికారుల కార్యాలయాల వివరాలు ఇలా ఉన్నాయి.


| నియోజకవర్గం.. | రిటర్నింగ్ ఆఫీసర్ కార్యాలయం |
|---|---|
| ముషీరాబాద్ (57) | తహసీల్ ఆఫీస్, ముషీరాబాద్, లోయర్ ట్యాంక్ బండ్ |
| మలక్‌పేట (58) | డిప్యూటీ కమిషనర్, సర్కిల్-6, మలక్‌పేట జీహెచ్ఎంసీ, నేషనల్ పార్కు, నల్గొండ క్రాస్ రోడ్స్, డెఫ్ అండ్ డమ్ స్కూల్ పక్కన |
| అంబర్‌పేట (59) | తహసిల్ ఆఫీస్, అంబర్‌పేట |
| ఖైరతాబాద్ (60) | జోనల్ కమిషనర్ కార్యాలయం, గ్రౌండ్ ఫ్లోర్, ఖైరతాబాద్ |
| జూబ్లీహిల్స్ (61) | తహసిల్ ఆఫీస్, షేక్‌పేట, బంజారాహిల్స్ |
| సనత్‌నగర్ (62) | డిప్యూటీ కమిషనర్ కార్యాలయం, బేగంపేట సర్కిల్-30, 3వ అంతస్తు, జోనల్ కమిషనర్ ఆఫీస్, సికింద్రాబాద్ |
| నాంపల్లి (63) | తహసిల్ కార్యాలయం, ఆసిఫ్‌నగర్, విజయనగర్ కాలనీ |
| కార్వాన్ (64) | తహసిల్ ఆఫీస్, గోల్కొండ |
| గోషామహల్ (65) | అబిడ్స్‌లోని జీహెచ్ఎంసీ కాంప్లెక్స్, 4వ అంతస్తులో.. |
| చార్మినార్ (66) | మొఘల్‌పురా స్పోర్ట్స్ కాంప్లెక్స్, మొదటి అంతస్తు, చార్మినార్ |
| చాంద్రాయణగుట్ట (67) | తహసిల్ ఆఫీస్, బండ్లగూడ |
| యాకుత్‌పురా (68) | తహసిల్ ఆఫీస్, సైదాబాద్, చంపాపేట రోడ్డు |
| బహదూర్‌పురా (69) | తహసిల్ ఆఫీస్, బహదూర్‌పుర |
| సికింద్రాబాద్ (70) | జోనల్ కమిషనర్ ఆఫీస్, ఫస్ట్ ఫ్లోర్, సికింద్రాబాద్ జోన్, మారేడ్‌పల్లి |
| సికింద్రాబాద్ - కంటోన్మెంట్(71) | చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్, సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు, కోర్టు హౌస్ కంపౌండ్, ఎస్పీ రోడ్డు |



## నిర్భయంగా ఎన్నికల నిర్వహణ

**నగరంలో పోలీసు గస్తీ**

సిటీబ్యూరో, అక్టోబర్ 29 (నమస్తే తెలంగాణ): శాసన సభ ఎన్నికల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు చర్యలు తీసుకుంటున్నారు. నగర పోలీస్ కమిషనర్ సందీప్ శాండిల్య ఆదేశాల మేరకు ఆదివారం నగరంలోని పలువురు డీసీపీలు వారి వారి జోన్ల పరిధిలో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. షాహినాయత్‌గంజ్, ఫలక్‌నుమా, బండ్లగూడ, జూబ్లీహిల్స్, ముషీరాబాద్, యూసుఫ్‌గూడ.. తదితర ప్రాంతాలలో కేంద్ర బలగాలతో కలిసి స్థానిక పోలీసులు ఈ ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. నార్త్, సెంట్రల్, సౌత్, సౌత్/ ఈస్ట్, సౌత్/వెస్ట్, వెస్ట్, ఈస్ట్‌జోన్లలోని ఆయా పోలీస్ స్టేషన్ల పరిధిలో ఈ ఫ్లాగ్‌మార్చ్ కొనసాగింది.



## ఎల్బీనగర్‌లో రూ.5 లక్షలు పట్టివేత

మన్సూరాబాద్: ఎల్బీనగర్ పీఎస్ పరిధిలో పోలీసులు చేపట్టిన తనిఖీల్లో ఓ వ్యక్తి వద్ద రూ. ఐదు లక్షలు లభించాయి. సరైన ఆధారాలు చూపలేదని, దీంతో నగదును సీజ్ చేసి ఎన్నికల అధికారులకు అప్పగించినట్లు పోలీసులు తెలిపారు.

## హయత్‌నగర్‌లో గంజాయి పట్టివేత



వాహనాన్ని తనిఖీ చేస్తున్న ఎక్సైజ్ పోలీసులు

హయత్‌నగర్, అక్టోబర్ 29 : అక్రమంగా తరలిస్తున్న రూ.2.51 లక్షల విలువైన గంజాయి, మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నామని హయత్‌నగర్ ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ టి.లక్ష్మణ్‌గౌడ్ తెలిపారు. ఇన్‌స్పెక్టర్ లక్ష్మణ్ గౌడ్ ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ.. ఎక్సైజ్‌శాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఆదివారం తెల్లవారుజామున ఏపీ నుంచి అబ్దుల్లాపూర్‌మెట్ మీదుగా హైదరాబాద్‌కు వస్తున్న ప్రైవేట్ ట్రావెల్స్, ఆర్టీసీ బస్సులు, గూడ్స్ వాహనాల తనిఖీలు చేపట్టామన్నారు. ఈ తనిఖీల్లో మల్కన్‌గిరి నుంచి హైదరాబాద్‌కు ప్రైవేట్ ట్రావెల్ బస్సులో తరలిస్తున్న 10 కిలోల గంజాయి ప్యాకెట్లు, ఐదు లీటర్ల గుడుంబా ప్యాకెట్లను గుర్తించి పట్టుకున్నారు. స్వాధీనం చేసుకున్న సామగ్రిని హయత్‌నగర్ ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్‌కు తరలించామని తెలిపారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.